ఏటిగడ్డతండా వద్ద ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

మహబూబాబాద్, మార్చి 23: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రం శివారులోని ఏటిగడ్డతండా వద్ద ఫిల్టర్ బెడ్, జిల్లా కేంద్రంలోని మిషన్‌భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఏటిగడ్డతండా వద్ద ఫిల్టర్ బెడ్ నుంచి నీటి సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ యాదవ్, డీఈ ఉపేందర్, మిష న్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.సురేందర్, డీఈ స్వామిదాస్, ఎంపీడీవో రేవతి, ఏఈ ప్రశాంత్ ఉన్నారు.

అనంతాద్రిలో ధ్వజ కుంభారాధన

మహబూబాబాద్ రూరల్, మార్చి 23: అనంతాద్రి శ్రీ జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్వారా తోరణం ధ్వజ కుంభారాధన చతుస్థానార్జన, హయగ్రీవ ఇష్టి హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. సౌమిత్రి హేమంత్ ఆచార్యులు యాజ్ఞిక నిర్వహణలో జరిగింది. అనంతాద్రి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ నూకల రామచంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రవణ్, కుమారాచార్యులు, విజయ్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-1** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **బానోతు అన్నపూర్ణ**, W/o : **రంగ, వయస్సు : 30** సం॥లు, **వృత్తి :** గృహిణి, **నివాసం :** మోద్దులగూడెం, కురవి మండలం, వరంగల్ జిల్లా. **నివాసం:**మోద్దులగూడెం శివారు, జజూర్‌తండ, కురవి మండలం, వరంగల్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి-1 : గ్రామ పంచాయితి మహబూబాబాద్, మండలం, మండల పరిషత్ మహబూబాబాద్, జిల్లా, జిల్లా పరిషత్ జిల్లా రిజిష్టారు వరంగల్, సబ్ రిజిష్టార్ మహబూబాబాద్ పరిధిలో గల మహబూబాబాద్ గ్రామము లోని ఖుష్కీ సర్వే నెం. 374 మింజములే భాళీ స్థల విస్తీర్ణం 156 చ॥గజాలు సమము 130.43 చ॥మీ॥లు ఇందులో ఎలాంటి కట్టడములు, నిర్మాణములు లేవు, ఏ వార్డు, ఏ బ్లాకునకు సంబంధించినది కాదు. **దాక్యుమెంట్ నెం. 6938/2010** గల ఆస్తికి హద్దులు : **తూర్పు :** 100 ఫీట్లు పి.డబ్ల్యూ.డీ. రోడ్డు, **పడమర :** అమ్మినవారి (భూక్య కళ్యాణ్) గారి స్థలం, **ఉత్తరం :** అమ్మినవారి (భూక్య కళ్యాణ్) గారి స్థలం, **దక్షిణం :** బానోతు వెంకట్రాం గారి స్థలం.

షెడ్యూలు ఆస్తి-2 : గ్రామ పంచాయితి మహబూబాబాద్, మండలం, మండల పరిషత్ మహబూబాబాద్, జిల్లా, జిల్లా పరిషత్ జిల్లా రిజిష్టారు వరంగల్, సబ్ రిజిష్టార్ మహబూబాబాద్ పరిధిలో గల మహబూబాబాద్ గ్రామము లోని ఖుష్కీ సర్వే నెం. 374 మింజములే భాళీ స్థల విస్తీర్ణం 439.33 చ॥గజాలు సమము 362.32 చ॥మీ॥లు ఇందులో ఎలాంటి కట్టడములు, నిర్మాణములు లేవు, ఏ వార్డు, ఏ బ్లాకునకు సంబంధించినది కాదు. **దాక్యుమెంట్ నెం. 7421/2009**గల ఆస్తికి హద్దులు : **తూర్పు :** పి.డబ్ల్యూ.డీ. రోడ్డు, **పడమర :** అమ్మినవారి మిగతా భూమి, **ఉత్తరం :** భూక్య సాంత్రియా గారి భూమి, **దక్షిణం :** బానోతు వెంకట్రాం గారి స్థలం.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-1** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **బానోతు మణి**, S/o : **శ్రీరాం, వయస్సు : 21** సం॥లు, **వృత్తి :** విద్యాభ్యాసం, **నివాసం :** మోద్దులగూడెం శివారు, జజూర్‌తండ, కురవి మండలం, వరంగల్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : గ్రామ పంచాయితి మోద్దులగూడెం, మండలం, మండల పరిషత్ కురవి, జిల్లా, జిల్లా పరిషత్, మరియు జిల్లా రిజిష్టారు వరంగల్, సబ్ రిజిష్టారు మహబూబాబాద్ వారి పరిధిలో గల మోద్దులగూడెం గ్రామములోని వ్యవసాయ ఖుష్కీ సర్వే నెం. 114/A&B మింజములే లోని విస్తీర్ణం ఎ.5.00 గుంటలు సమము 2 హెక్టార్లు, **దాక్యుమెంట్ నెం. 304/2015** గల ఆస్తికి హద్దులు : **తూర్పు :** చెన్నయ్య గారి వ్యవసాయ భూమి, **పడమర :** మెంగ అమరావతి గారికి సంబంధించిన సర్వే నెం. 118లో నుండి పోవు డొంక, **ఉత్తరం :** బాణోతు అన్నపూర్ణ గారి వ్యవసాయ భూమి, **దక్షిణం :** చెన్నయ్య గారికి చెందిన బండ్ల బాట.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

పాలం.. పశువులపాలు

- పొట్ట దశలో ఎండిన వరిపంట
- ఆకేరువాగులో గుంతలు తవ్వినా నీరు లేదు
- పెట్టుబడి నష్టపోయిన రైతు

ఎండిపోయిన పొలం మేస్తున్న పాడిగేదెలు

నర్సింహులపేట, మార్చి 23: ఎటుచూసినా ఎండిన పంటలు, అడుగంటిన చెరువులు, కుంటలు, బావులు, బోర్లు, వాగులు కనిపిస్తున్నాయి. చేతికొచ్చే దశలో వరి పంటకు నీళ్లు అందక ఎండిపోవడంతో పశులకు మేతగా మారుతోంది. ఏడెనిమిదేళ్ల తర్వాత పాత రోజులు గుర్తుకువస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎండాకాలంలోనూ చెరువులు, వాగు లు మత్తళ్లు దుంకాయని, ఇప్పుడు వాగుల్లో బావులు తవ్వినా నీరు రావడంలేదని బాధపడుతున్నారు. మండలంలోని జయపురం, రామన్నగూడెం, ముంగిమడుగు శివారులో నుంచి ప్రవహించే ఆకేరువాగులో చుక్కనీరు లేకపోవడంతో వాగులో జేసీబీలతో నీటికోసం రైతులు గుంతలు తీస్తున్నారు. జయపురం గ్రామానికి చెందిన కాస్సిరెడ్డి లింగారెడ్డి తన రెండు ఎకరాల పొలం సాగు కోసం రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టగా తీరా వరి కంకి వచ్చే సమయంలో వాగులో నీరు లేక పంట ఎండిపోయింది. చేసేదిలేక పాడి గేదెలను మేపుతున్నాడు.

ఇన్నేళ్లుగా చూడలె..

నేను వ్యవసాయం చేసినప్పటి నుంచి ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఏడెనిమిదేళ్లలో ఎప్పుడు చూసినా వాగు చెక్‌డ్యామ్ మత్తడి పోసేది. నా చిన్నతనంలో వాగులో గుంతలు తీసినం. మళ్లా ఇప్పుడు జేసీబీలతో బావులు, గుంతలకు రూ.20వేలు పెట్టి తీసినా గంట కూడా నీరు రావడం లేదు. రెండు ఎకరాలకు రూ.40వేల పెట్టుబడి పెట్టిన. నీళ్లు వస్తాయని ఇన్ని రోజులు ఎదురుచూసినం. నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. పొట్టదశలో ఉన్న పొలం రెండు ఎకరాలు ఎండిపోయింది. పశువులను మేపుతున్నాం. 10రోజుల వరకు నీళ్లు రాకపోతే మిగతా రైతులు సుమారు 200ఎకరాలకుపైన ఎండిపోతాయి.

- కాస్సిరెడ్డి లింగారెడ్డి, రైతు, జయపురం

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మోదీ దిష్టిబొమ్మ దహనం

మహబూబాబాద్ రూరల్, మార్చి 23 : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధాని మోదీ జేబు సంస్థగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని వివేకానందా సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీని ఎదిరించిన ప్రతిపక్ష పార్టీల నేతలపై ఈడీతో దాడి చేయిస్తోందన్నారు. నాయకులు సూర్నపు సోమయ్య, సీతారాం, శ్రీనివాసరెడ్డి, రావుల రాజు, శ్రీనివాస్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంపై రైతులకు బోనస్ ఇవ్వాలి

కేసముద్రం మార్కెట్‌ను సందర్శించిన తెలంగాణ రైతు సంఘం నాయకులు

కేసముద్రం, మార్చి 23 : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యంపై రైతులకు బోనస్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టి యాసంగిలో సుమారు 2.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించకపోడం వల్ల పంటలు ఎండిపోతున్నాయన్నారు. దీంతో రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల విషయంలో రాజకీయం చేస్తూ సాగునీరు ఇవ్వకుండా రైతులను బలిచేస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసాలో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి మూడు నెలలు గడుస్తున్నా మాఫీ చేయలేదన్నారు. రైతులు పండించిన పంటలకు కేరళ రాష్ట్రం తరహాలో బోనస్ అందిస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. పం టలు సాగు చేసి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు రైతు బంధు అమలు కాలేదని ఆరోపించారు. అకాల వర్షాలతో చేతికి అందే దశలో రైతులు పంటలు దెబ్బతిని నష్టపోయారని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పంట నష్టపరిహారంగా ఎకరానికి రూ. 20వేలు అందించాలని కోరారు. జిల్లాలో 18 మంది మిర్చి రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుణిగంటి రాజన్న, ప్రధాన కార్యద ర్శి శెట్టి వెంకన్న, రైతు సంఘం నాయకులు బొబ్బాల యాకూబ్‌రెడ్డి, రాజారావు, సోమటిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కావటి నర్సయ్య, నీరుటి జలేందర్ ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయం

జిల్లా వైద్యాధికారి కళాబాయి

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కళాబాయి

మహబూబాబాద్, మార్చి 23 : క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలని మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి బీ కళాబాయి అన్నారు. శనివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించే వీహెచ్ఎన్‌డీ రోజు క్షయవ్యాధి లక్షణాలు, నివారణ, పూర్తి చికిత్సలపై ప్రజలకు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో ఆర్బీఎస్కే టీములు పాఠశాలలను సందర్శించినప్పుడు విద్యార్థుల్లోనూ ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మంగళవారం, గురువారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమంలో ఊపిరితిత్తుల ద్వారా వచ్చే క్షయవ్యాధి కాకుండా ఇంకా శరీరంలోని ఏ భాగానికి వ్యాధి సోకుతుందో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి అంబరీష, వైద్యులు సుధీర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, ప్రసాద్, రవీందర్‌రావు, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న సమత

రైతు భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కేసముద్రం, మార్చి 23: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్మించే రైతు భవనానికి కేసముద్రానికి చెందిన మమత, సమత రూ.లక్ష విరాళాన్ని శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావుకు అందించారు. మార్తినేని పాపారావు, శ్రీలత దంపతులకు కుమార్తెలు మమత, సమత తల్లి జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు. రైతు సంఘం నాయకులు రాజన్న, శెట్టి వెంకన్న, యాకూబ్‌రెడ్డి ఉన్నారు.

పకడ్బందీగా ఎల్‌సీడీసీ సర్వే

తొర్రూరు, మార్చి 23: కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ పా రా మెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో ఐదు పీహెచ్‌సీల పరిధి గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపట్టిన లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌లో కుష్ఠు వ్యాధి సర్వే ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అమ్మాపురంలో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. డివిజన్ పరిధిలో కుష్ఠు వ్యాధి సర్వేలో 268 టీములు 73,109 గృహాలను సందర్శించి 2,80,528 పరీక్షలు నిర్వహించగా, 646 అనుమానిత కేసులను గుర్తించారని, వారికి పరీక్షలు చేయగా 2రెండు మల్టీ బిసిలరి కేసుల గురించి ఎండీటీ, ఎండీ మల్టీ డ్రగ్స్ థెరపీ అందజేయనున్నట్లు వివరించారు. సీహెచ్‌వో విజయ్‌కుమార్, పీఎంవో కృష్ణ పాల్గొన్నారు.

'దేశాన్ని జైలుగా మారుస్తున్న బీజేపీ ప్రభుత్వం'

తొర్రూరు, మార్చి 23: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ దేశాన్ని జైలుగా మారుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై విద్యార్థులు, యువకులు భగత్ సింగ్ స్ఫూర్తితో సమరశీల పోరాటాలు చేయాలని పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు ఇరుగు అనిల్, భూక్యా సంతోష్ పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం హిట్లర్ వారసుడిగా మారాడన్నారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి సెగ్గెం యాకయ్యతోపాటు వీరన్న, వెంకట్, ప్రశాంత్, రాము, హరీశ్, సత్యం, బాలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

కొత్తగూడ : దేశంలో మోదీ సంస్కరణలకు వ్యతిరేకంగా యువకులు, ప్రజలు ఉద్యమించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బూర్క వెంకటయ్య పిలుపునిచ్చారు. స్థానిక న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగుల కృష్ణ స్మారక భవనంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ కొత్తగూడ మండల కార్యవర్గం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకుడు ఆగబోయిన నర్సక్క, న్యూడెమోక్రసీ నాయకులు దేవుళపల్లి మంగన్న, లక్ష్మన్న, వెంకన్న, పిన్నింటి నారాయణరెడ్డి, స్వప్న, ప్రదీప్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు

భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్/గార్ల/నర్సింహులపేట/కురవి, మార్చి 23: భగత్‌సింగ్ సేవలకు గుర్తింపుగా భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గందసిరి జ్యోతిబసు, నాయకులు వీరేందర్, మహేశ్, వినయ్, ప్రశాంత్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగతసింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కలెక్లం వీరారెడ్డి మాట్లాడారు. సభ్యులు కొమిరే ఉప్పలయ్య, సదానందం, సైదులు, శ్రీనివాస్, కే శ్రీనివాస్, బావ్‌సింగ్, అశోక్, రవిప్రసాద్, వీరన్న, గోపి పాల్గొన్నారు. జమాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి హెచ్ఎం గుగులోత్ కిషన్ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గార్ల రైల్వే స్టేషన్ ఆవరణలోని భగత్‌సింగ్ విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు మాగం లోకేశ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పీడీఎస్ యూ జిల్లా నాయకుడు గొడిశాల మనోజ్ పూలమాల వేసి నివాళుర్పించారు. కురవి మండల కేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి రాజన్న, రమేశ్, సారయ్య, నాగేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్: భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దవంగర ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

పెద్దవంగర, మార్చి 23: పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం శనివారం నెగ్గింది. మండలంలో మొత్తం 9 ఎంపీటీసీలు ఉండగా, వాటిలో ఇటీవల పెద్దవంగర ఎంపీటీసీ ఏదునూరి శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. మిగతా 8 మంది ఎంపీటీసీల్లో బొమ్మరబోయిన కల్పనయాదవ్ (అవుతాపురం), బానోత్ విజయ (పోచంపల్లి),ఈరెంటి అనురాధ (గంట్లకుంట), ఎర్ర సబిత(కొరిపెల్లి), మెట్టు సౌజన్య (చిన్నవంగర), బానోత్ రవీందర్‌నాయక్ (బొమ్మకల్లు) ఎంపీపీపై శనివారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా చేతులెత్తి ఆమోదాన్ని తెలిపారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో నరసింహరావు ప్రకటించారు. నివేదికను కలెక్టర్‌కు పంపి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, తహసీల్దార్ మహేందర్, ఎంపీవో సత్యనారాయణ, ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సూరయ్య, ఆర్ఐ లష్కర్ పాల్గొన్నారు. కాగా, ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి ఆమోదం తెలిపి కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జాటోత్ నెహ్రూనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీటీసీలు కల్పనాయాదవ్, రవీందర్‌నాయక్, సబిత, సౌజన్య, అనురాధ, విజయ, పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళిగౌడ్, కుమారస్వామి, శ్యామ్, సైదులు, శ్రీనివాస్, సతీశ్‌గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

ఎంపీపీ రాజేశ్వరిపై అవిశ్వాసాన్ని ఆమోదించిన ఎంపీటీసీలు

పరీక్ష సెంటర్‌ను తనిఖీ చేసిన డీఈవో

దంతాలపల్లి, మార్చి 23: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని డీఈవో రామారావు తనిఖీ చేశారు. శనివారం పరీక్ష సెంటర్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంగ్లిష్ పరీక్ష రోజు విద్యార్థిని అక్షయ పరీక్ష రాస్తూ స్పృహ తప్పి పడిపోగా వెంటనే సిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులు అందించగా పరీక్ష రాసినట్లు తెలిపారు.

క్రీడాకారులతో ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, డీఎస్పీ, సీఐ

క్రీడలతో మానసిక ఉల్లాసం

గంగారం మార్చి 23: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ అన్నారు. ఎస్పీ బాధ్యతలు చేపట్టిన తర్వాత శనివారం తొలిసారి ఏజెన్సీలోని గంగారం మండలంలో పర్యటించారు. మండలంలోని తిర్మలగండి కుమ్రంభీం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్పీ క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు భయాందోళనకు లేకుండా ఓటు హక్కు వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ తిరుపతి, సీఐ బాబురావు, ఎస్సైలు రవికుమార్, దిలీప్, నగేశ్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల మార్చ్ ఫాస్ట్

కొత్తగూడ, గూడూరు , మార్చి 23: ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మండల కేంద్రంలో కేంద్ర బలగాలు పోలీస్ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని అన్నారు. డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గూడూరు మండల కేంద్రంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబూరావు, గూడూరు, కొత్తగూడ, గంగారం ఎస్సైలు, సీఆర్‌పీఎఫ్, టీఎస్ఎస్పీ, సివిల్ బలగాలతో శనివారం కవాతు నిర్వహించారు. ఎస్సైలు నగేశ్, దిలీప్, రవికుమార్, పోలీస్ సిబ్బంది శ్యాం, బిచ్చానాయక్ పాల్గొన్నారు.

బావిలో పిల్లలను తోసేసిన ఘటనలో కేసు నమోదు

నెల్లికుదురు, మార్చి 23: ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను బావిలో తోసేసి, తానూ దూకగా, తల్లి, కూతురు మృతిచెందిన ఘటనలో అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకున్నారు. ఎస్సై కె.క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపురానికి చెందిన ఆకుల లావణ్య (30), భర్త మురళిని ఈనెల 22న ఉప్పలమ్మ పండుగకు రావాలని వీఎస్ లక్ష్మీపురంలోని బంధువులు ఆహ్వానించారు. వద్దని చెప్పినప్పటికీ భర్త వెళ్లడంతో లావణ్య మనస్తాపం చెంది కూతురు ఆకు నిత్యశ్రీ (6), కుమారుడు ఆకుల ముఖేశ్ (10) గ్రామ శివారులోని నల్లాల బావిలో తోసేసింది. తానూ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లావణ్య, నిత్యశ్రీ నీటిలో మునిగి మృతిచెందారు. ముఖేశ్ బావిలో ఇనుప కడ్డీల సాయంతో పైకి వచ్చి గ్రామస్తులకు తెలిపాడు. గ్రామస్తులు వెళ్లి చూడగా వారిద్దరి మృతదేహాలు నీటిపై తేలుతూ కనిపించాయి. మృతురాలి అక్క రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శనివ